ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలి : సిఐటియు

చిత్తూరు అర్బన్ : అంగన్‌వాడీల వేధింపులకు కారణమవుతున్న ఎఫ్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. గతంలో చలో విజయవాడకు పిలుపునివ్వగా దిగివచ్చిన ప్రభుత్వం చర్చలు జరిపిందని గుర్తు చేశారు. మార్పులు చేస్తామని చెప్పినా ఇంతవరకూ పట్టించుకోలేదని మండిపడ్డారు. మార్పులు చేసేంత వరకూ యాప్‌ను ఉపయోగించరాదని అంగన్‌వాడీలు రాష్ట్రవ్యాప్తంగా నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈనెలలో జిల్లా అధికారులు అంగన్‌వాడీలను బెదిరిస్తున్నారన్నారు. బైరెడ్డిపల్లి సిడిపిఒ వాయిస్ మెసేజ్‌లు పెడుతూ వర్కర్లను ఇష్టారాజ్యంగా బెదిరిస్తున్నారన్నారు. ఎఫ్‌ఆర్‌ఎస్ చేయకపోతే జీతాలు ఇచ్చేది లేదని బెదిరించే అధికారం ఎవరిచ్చారని ప్రశ్నించారు. బెదిరింపులకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని, ఎఫ్‌ఆర్‌ఎస్ మార్పులు చేయాలని డిమాండ్‌చేశారు.

'ఎస్...ఒపిఎస్' అనాల్సిందే..!

• యుటిఎఫ్ నిరసనల హోరు • చిత్తూరులో నిరవధిక దీక్ష భగ్నం



చిత్తూరులో దీక్ష భగ్నం చేసి అరెస్టు చేసిన పోలీసులు

బలవంతంగా దీక్ష భగ్నం చేయిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, చిత్తూరు అర్బన్, యంత్రాంగం

పాత పెన్షన్ సాధించేవరకూ పోరాటం ఆగదని, సిపిఎస్, జిపిఎస్ రద్దు చేయాలని వక్తలు ఉద్ఘాటించారు. ఒపిఎస్ పునరుద్ధరణ కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక దీక్షలు రెండో రోజు శుక్రవారం కొనసాగాయి. చిత్తూరులో నిరవధిక దీక్షను పోలీసులు భగ్నం చేసి నేతలను స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం ఎంత నిర్బంధం కొనసాగించానా ఒపిఎస్ సాధించేవరకూ పోరాడతామని జిల్లావ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగాయి.

చిత్తూరు అర్బన్ : సిపిఎస్ మాకొద్దు.. ఒపిఎస్ కావాలి' అంటూ చిత్తూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం చేపట్టిన నిరవధిక దీక్షను శుక్రవారం పోలీసులు భగ్నం చేశారు. యుటిఎఫ్ నాయకులు రాత్రుల్లో సైతం దీక్షా శిబిరంలోనే నిరశన కొనసాగించారు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు వన్‌టౌన్ ఎస్‌ఐ విశ్వనాధరెడ్డి ఆధ్వర్యంలో దీక్షా శిబిరం వద్దకు వచ్చి యుటిఎఫ్ నాయకులు రఘుపతిరెడ్డి, జీవి రమణ, సుధాకర్‌రెడ్డి, సోమశేఖర్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రెడ్డప్పనాయుడు, దక్షిణామూర్తి, ఎంవి రమణ, పార్థసారథినాయుడులకు బలవంతంగా నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. నాయకులను అరెస్టు చేసి పోలీసు వాహనాల్లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ తీరుపై యుటిఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆస్పత్రిలో నాయకులను పరీక్షించిన వైద్యులు నేతలకు బీపీ, సుగర్ లెవల్స్ తగ్గాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల పాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ భరోసా కోసం యుటిఎఫ్ చేసిన నిరవధిక దీక్షలకు ఎపిటిఎఫ్ 1930 జిల్లా నాయకత్వం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శాంతి యుతంగా హక్కుల సాధనకోసం అమరణ నిరాహార దీక్షలకు పూనుకున్న తమపై రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల ద్వారా దీక్షలను భగ్నం చేయడం దుర్మార్గమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, జివి రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ఫోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

తిరుపతి టౌన్‌లో... యుటిఎఫ్ కార్యాలయంలో పాత పెన్షన్ సాధనకై గురువారం ప్రారంభమైన నిరాహారదీక్ష శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ముత్యాలరెడ్డి. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.నిర్మల, జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య, సిపిఎస్ సబ్‌కమిటీ జిల్లా కో కన్వీనర్ ఆర్.నాగరాజు పాల్గొన్నారు.

గూడూరులో.. పాత బస్టాండ్ సమీపంలో విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వాసుదేవరావు, జిల్లా కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. వీరి ఆందోళనకు సిపిఎం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, ఎల్ఐసి అసోసియేషన్ నాయకులు విజయ్‌కుమార్, శివకుమార్ సంఘీభావం ప్రకటించారు. యుటిఎఫ్ నాయకులు రవి, మురళీసింగ్, శివకళ, నాగేశ్వరరావు, పానేష్, గురునాధం పాల్గొన్నారు.

నగరిలో...

సూళ్లూరుపేటలో... సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ యుటిఎఫ్ మండల శాఖల ఆధ్వర్యంలో సూళ్లూరుపేట సిఐటియు ఆఫీసులో నిరవధిక దీక్ష చేపట్టారు. పూర్వపు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెంగని చంద్రశేఖర్, తిరుపతి జిల్లా అధ్యక్షులు జిజె రాజశేఖర్ ప్రారంభించారు. ఈ దీక్షల్లో కావూరు ప్రభాకర్, ఎస్.బాబు, కొప్పోలు అరుణకుమారి, ఎ.గోవర్ధన్, ఎన్.రవికుమార్ పాల్గొన్నారు. **వెంకటగిరిలో...** వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల యుటిఎఫ్ కార్యకర్తలు నిరవధిక దీక్షలో పాల్గొన్నారు. ఎవరైతే ఒపిఎస్ అమలు చేస్తారో వారికే తమ ఓటని నేతలు హెచ్చరించారు. దీక్షల్లో జిల్లా కార్యదర్శి ఎం.కుమారస్వామి, రాష్ట్ర కౌన్సిలర్ కె.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. సిఐటియు నాయకులు వడ్డిపల్లి చెంగయ్య సంఘీభావం ప్రకటించారు. **నాయుడుపేటలో...** సిఐటియు కార్యాలయంలో దీక్ష చేపట్టారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.రామ్మూర్తిరాజు, మాజీ జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ప్రసంగించారు. సిఐటియు నాయకులు ముకుంద, వెంకటేశ్వర్లు సంఘీభావం ప్రకటించారు. **నగరిలో...** జరిగిన దీక్షలోమెన్.మణిగండన్, కె.కుప్పరాజు, కె.వంశీకృష్ణ, మాసిలామణి, యువరాజు, హరిదాసు, ఆనందయ్య, షన్ముగం పాల్గొన్నారు. **పలమనేరులో...** యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రకాష్, జిల్లా నాయకులు ప్రసన్నకుమార్, కృష్ణమూర్తి, బాబు, దయానంద, గురుమూర్తి పాల్గొన్నారు. ఆప్టా సంఘ నాయకులు మునాఫ్, ప్రభుత్వ పెన్షనర్ సంఘ నాయకులు రత్నారెడ్డి, ప్రజాసంఘాల నాయకులు ఓబుల్‌రాజు, గిరిధర్‌గుప్తా సంఘీభావం తెలిపారు.

పంటలపై ఏనుగుల స్వైర విహారం..!

ప్రజాశక్తి - రామకుప్పం

మండల పరిధిలోని పంద్యాల మడుగు పంచాయతీ గొల్లపల్లి గ్రామం లో పంట పొలాల పై ఏనుగులు స్వైర విహారం చేశాయి. గురువారం రాత్రి గంట్లప్ప, బాబు అనే రైతులకు చెందిన వరి, అరటి తోటలను తీవ్రం గా నష్ట పరిచాయి. మూడు ఏనుగుల గుంపు కోతకు వచ్చిన పంటలను తిన్నంత తిని.. తొక్కి నాశనం చేసి పోవటం తో చేసేది లేక బాధిత రైతులు గుండెలు పగిలేలా విలపిస్తున్నారు. అటవీ సరిహద్దు ప్రాంతంలోనీ గ్రామాల వైపు తరచూ ఏనుగులు పంటలు నాశనం చేస్తూ... రైతులని మరింత అప్పుల ఊబి లోకి నెట్టేస్తున్నా ... ప్రభుత్వ యంత్రాంగం శాశ్వత పరిష్కారం చూపక పోవటం కొసమెరుపు. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఎన్నో సార్లు అధికార్లు కు రైతులు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు వాపోతున్నారు. అదే విధంగా అడవుల్లో జంతువులకు నీరు, ఆహారం సంవద్ధి గా లభించే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే ... జంతువులు అడవిని దాటి గ్రామాల వైపు రావని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అడవుల్లో ఆహారం లభించక... ఆహార అన్వేషణలో భాగంగా ఏనుగులు గ్రామాల పై పడుతున్నాయి. చీకటి పడితే పొలాల వైపు వెళ్ళాలంటే అటవీ సమీప రైతులు హడలిపోతున్నారు . ముఖ్యంగా అటవీ సరిహద్దు ప్రాంతం చుట్టూ అసం పూర్తిగా ఉన్న కంద కాలను పూర్తి చేసి... సోలార్ ఫెన్సింగ్ ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టపోయిన రైతులకు చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - సోమల

సోమల మండలం పేటూరు, ఆవులపల్లి పంచాయతీల పరిధిలో ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన పలువురు రైతులకు ప్రజాప్రతినిధులు, అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆవులపల్లి పంచాయతీలో ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన 17 మంది రైతులకు రెండు లక్షల 17 వేల రూపాయలు, పేటూరు పంచాయతీలో ఏడు మంది రైతులకు 73 వేల రూపాయల పంట నష్ట పరిహార చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విమల, ఎంపీటీసీ సర్వేశ్వరి, ఎఫ్ ఎస్ ఓ ధనుంజయుడు, ఎఫ్ బి ఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన ఆర్‌డిఒ

చిత్తూరుఅర్బన్: పలమనేరు ఆర్‌డిఒగా నియమితులైన మనోజ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. పలమనేరు డివిజన్ ఆర్‌డిఒగా నియమితులు కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించనున్నట్లు మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మంగళ్ విద్యాలయంలో ఎన్‌సిసి శిక్షణ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం, పేటమిట్ట మంగళ్ విద్యాలయంలో ఎన్‌సిసి ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమర రాజ సంస్థల వ్యవస్థాపకులు డా. గల్లా రామచంద్ర నాయుడు, ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కొల్నెల్ యోగేశ్ దుంగ్రకోటి , కొల్నెల్ అజయ్ బస్నెట్ హాజరయ్యారు. మొదటి బ్యాచ్ గా 100 మంది విద్యార్థులు శిక్షణ పొందనున్నారు. డా. గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ మంగళ్ విద్యాలయంలో ఎన్‌సిసి ప్రారంభించడం చాలా సంతోషించదగిన విషయమని, ఎన్‌సిసి విద్యార్థుల మనోవికసానికి, శారీరక పటుత్వానికి ఎంతగానో తోడ్పడుతుందని ,ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కొల్నెల్ యోగేశ్ దుంగ్రకోటి మాట్లాడుతూ మంగళ్ విద్యాలయంలో ఎన్‌సిసి ప్రారంభించడం చాలా సంతోసించ దగిన విషయం అన్నారు. విద్యార్థుల క్రమ శిక్షణకు ఎన్‌సిసి దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమం లో రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్. సతీష్, ప్రిన్సిపల్ ధనంజయ నాయుడు పాల్గొన్నారు.

మురికివాడలను పరిశీలించండి

చిత్తూరుఅర్బన్: చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని మురికివాడలను పరిశీలించి మౌళిక వసతులు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో నగర కమిషనర్‌ను కోరారు. వీస్తీర్ణం పెరిగినా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచడం లేదని, 64 మురికివాడల్లో జనం మౌళిక వసతులకు నోచుకోకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. మురికివాడల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి మౌళిక వసతులు కల్పించాలని కోరారు.

ఉద్యోగుల 'స్పందన'కు 8 అర్జీలు:కలెక్టర్



ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడవ శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా శుక్రవారం ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు సంబంధించి 8 అర్జీలు అందాయని కలెక్టర్ ఎస్. షన్మోహన్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ఉద్యోగుల స్పందన కార్యక్రమానికి డి.ఆర్.ఓ ఎన్. రాజశేఖర్ లతో కలసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల ఉద్యోగుల నుండి అర్జీలను స్వీకరించారు. శాఖల వారీగా అర్జీలు రెవెన్యూశాఖ 2 , డి యం అండ్ హెచ్ ఓ 2, సాంఘిక సంక్షేమ శాఖ 2, విద్యా శాఖ 2 అందాయి.

చంద్రబాబు విడుదల కావాలని యాగం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

దుర్గా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జిజేఎం ట్రస్టు ఛైర్మెన్ గురజాల జగన్‌మోహన్ నాయుడు లక్ష్మీనగర్ కాలనీలోని తమ నివాసంలో హోమం నిర్వహించారు. శుక్రవారం పెద్ద సంఖ్యలో మహిళలు చండీయాగంలో పాల్గొన్నారు. జీజేఎం ట్రస్ట్ ఛైర్మెన్ జగన్‌మోహన్ నాయుడు కుటుంబ సభ్యులు, తెలుగు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ నాయుడు మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజల కోసం ఎనలేని సేవలు అందించిన చంద్రబాబునాయుడుపై ఉద్దేశపూర్వకంగా పెట్టిన తప్పుడు కేసుల నుండీ క్లీన్‌చిట్‌తో చంద్రబాబు జైల్ నుండీ బయటకురావాలని కోరుతూ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు ఆసక్తి చూపాలి : జేసీ

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులను చేపట్టందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి. రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ....చిత్తూరు జిల్లాలోని రైతులు ప్రధానంగా ఉద్యానవన పంటల సాగు తో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు మారాలని, ప్రభుత్వం లాభసాటి వ్యవసాయం కొరకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొనే దిశగా రైతులు కషి చేయాలని తెలిపారు. ప్రతి నెలా జరిగే వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వ్యవసాయరంగానికి అందిస్తున్న పథకాలు గురించి చర్చిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఖర్చులు తగ్గించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలు, విధి విధానాల గురించి జిల్లా వ్యవసాయ సలహా మండల్లో ప్రధానంగా చర్చించడం జరుగుతుందనన్నారు. మామిడి పంట లో సేంద్రియ విధానంలో సాగు చేసేందుకు పలువురు సలహాలు కోరడం జరుగుతుందని, త్వరలో సదస్సులు నిర్వహణ కు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ గ్రూపుల ద్వారా డ్రోన్ పరికరాలను ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పించాలని,మిల్లెట్స్ సాగు చేసే వారికి సబ్సిడీ కల్పించాలని ప్రధానంగా నీమ్, నీమ్ ఆయిల్ వంటి పదార్థాలు తప్పనిసరి అవుతున్నాయని బయట ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం కొంత ఇబ్బందికరంగా ఉంటుందని రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీలో చెల్లించే విధంగా చూడాలని సభ్యులు కోరారు. ఇందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకష్ణ వివరిస్తూ ..ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ హైదరాబాదు వారు త్వరలో జిల్లా కు రానున్నారని వారి ద్వారా శిక్షణ తీసుకొని యంత్ర సామాగ్రిని ఉపయోగించుకుని నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేసుకునేందుకు వీలు ఉంటుందని అన్నారు..వైయస్సార్ పశు నష్టపరిహారం కింద 7200 మంది రైతులకు 16 కోట్లు ఇవ్వడం జరిగిందని, రానున్న కాలంలో బీమా ఇవ్వడం జరుగుతుందని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ప్రభాకర్, పట్టుపురుగుల పెంపకానికి సంబంధించిన షెడ్ల నిర్మాణంలో డ్వామా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాల ద్వారా సబ్సిడీ అందజేయడం జరుగుతుందని పట్టు పరిశ్రమ శాఖ జేడి శోభారాణి సభ లో వివరించారు. యాంత్రికరణ చేపట్టడం ద్వారా వధా అరికట్టేందుకు, సేంద్రియ ఎరువులను తయారు చేసుకునేందుకు వివిధ యంత్రాలు ఉన్నాయని వాటిని పరిశీలించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సభ్యుడు గోవర్ధన్ బాబి అన్నారు. ఈ సమావేశంలో సూక్ష్మ పోషకాలు, మామిడి పంటకు సంబంధించి మరోసారి అవగాహన సదస్సులు, కిసాన్ క్రెడిట్ కార్డులకు సంబంధించి, డ్రోన్ కెమెరాలకు ప్రత్యామ్నాయం గురించి, మిల్లెట్స్ గురించి అవగాహన కల్పించేందుకు, వివిధ రకాల యంత్రాలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్కోఈఈ శ్రీహరి, సభ్యులు రత్నారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం... ఆర్భాటం..!

తూతూమంత్రంగా ఆరోగ్యసురక్ష శిబిరాలు

మందులు, పరీక్షలు, పరికరాలు ఉత్తిదే..

వైద్యశిబిరంలో ఇచ్చిన స్లిప్పులతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి వచ్చిన రోగులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యం అంటూ వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఒక్క రూపాయి ఖర్చు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. శిబిరాల్లో ఎక్కడా స్పెషలిస్టు డాక్టర్లు కానరావడం లేదనీ, అరకొర పరీక్షలు, మందులు, పరీక్షలతోటే సరిపెట్టేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వైద్య సేవలు పొందేందుకు వచ్చేవారిని కూర్చోబెట్టి, గంటల తరబడి సమావేశాలు నిర్వహించి, కొంతమందికి సీఎం ఫొటో ముద్రించి ఉన్న సంచులు (కిట్లు) ఇస్తున్నారే తప్ప పూర్తిస్థాయి పరీక్షలు చేసి, మందులు ఇవ్వడం లేదంటూ కొందరు రోగులు పెదవి విరుస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసుకుని ఉన్నత వైద్యం కోసం పెద్దాస్పత్రులకు రెఫర్ అయిన రోగులకు అక్కడ కూడా అరకొర వైద్యమే అందుతుండటం విచారకరం. ఇటీవల శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయిలో నిర్వహించిన శిబిరాల నుంచి రెఫర్ అయిన సుమారు వెయ్యికి పైగా రోగులు శుక్రవారం శ్రీకాళహస్తికి రాగా వీరికి అందుబాటులో లేని వైద్యులు, అరకొర పరీక్షలు, మందులే దర్శనమివ్వడం ఇందుకు నిదర్శనం.

రోగాలను ముందస్తుగా గుర్తించి వాటిని తక్కువ ఖర్చుతోనే నయం చేసేలా వైసీపీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. రాష్ట్రంలోని 15,005 సచివాలయాల ద్వారా 1.67 కోట్ల పేద కుటుంబాలకు పైసా ఖర్చు లేకుండా వ్యాధులను గుర్తించి నయం చేయడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. అయితే క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే జగనన్న సురక్ష శిబిరాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. శిబిరాల వద్ద 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు, అనుభవజ్ఞులైన స్పెషలిస్టు వైద్యులను అందుబాటులో ఉంచాల్సి ఉండగా, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి.

జగనన్నకు చెప్పుకోండి!

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో గత నెల రోజులుగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శరవేగంగా జరుగుతున్నాయి. వాలంటీర్లు, వైద్య సిబ్బంది గుర్తించిన రోగులు ఈ శిబిరాలకు టోకెన్లతోటి హాజరవుతున్నారు. అయితే శిబిరాల వద్ద అర్బన్, మండల స్థాయిలో పనిచేసే వైద్యులు మాత్రమే అందుబాటులో ఉండడంతో స్పెషలిస్టుల కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి పంపిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వెయ్యికి పైగా రెఫర్ రోగులు పెద్ద ఎత్తున ఏరియా ఆసుపత్రికి రాగా అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమందిని తూతూమంత్రంగా పరీక్షించి పంపేయడంతో రోగులు వైద్యుల తీరుపై మండిపడ్డారు. ఈ మాత్రం దానికి మాకు టోకెన్లు, వారం రోజుల నిరీక్షణ, వ్యయ, ప్రయాసలు అవసరమా అంటూ నిలదీశారు. పైగా ఆరోగ్యశ్రీ లో చికిత్స చేసుకోండి అంటూ ప్రయివేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే జగనన్నకు చెప్పుకోండని ఉచిత సలహా ఇచ్చారంటూ మండిపడ్డారు. ఈ విషయంపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మిని వివరణ కోరగా శుక్రవారం 50 మంది రెఫర్ రోగులు మాత్రమే వచ్చారనీ, అందరికీ పరీక్షలు చేసి, మందులిచ్చి పంపినట్లు తెలిపారు. ఒక్కర్ని మాత్రమే అడ్మిషన్ లో ఉంచామని చెప్పడం గమనార్హం.

పరీక్షలే చేయలేదు: పెద్ద గున్నయ్య, రోగి

నాకు వినికిడి సమస్య ఉంది. మా వాలంటీర్, నర్సు చెబితే శిబిరానికి వెళ్ళా. స్పెషలిస్ట్ డాక్టర్ లేకపోవడంతో పెద్దాస్పత్రికి పొమ్మన్నారు. తీరా ఇక్కడికొస్తే పరీక్షలే చేయకుండా పంపారు. వినికిడి యంత్రం అడిగితే జగనన్నకు చెప్పమని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

రక్తం కొనుక్కోమన్నారు: వెంకట్రామయ్య రోగి

మా ఊర్లో నిర్వహించిన శిబిరంలో నాకు రక్త పరీక్షలు చేసి రక్తం 3 శాతమే ఉందని చెప్పారు. వెంటనే రక్తం ఎక్కించుకోమని పెద్దాస్పత్రికి పొమ్మన్నారు. తీరా ఇక్కడకు వస్తే నువ్వే రక్తం తెచ్చుకో, అప్పుడు మేం ఎక్కిస్తామని సెలవిచ్చారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజలకు వైద్యం అందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-గుడుపల్లి: మండలంలోని కాడేపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్య బృందం తెలిపారు. శుక్రవారం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 300మంది ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు మధు, ఝాన్సిరాణి, టిడిపి నాయకులు మంజునాథ్, సుబ్రమణి, భాను, షంషీర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ


నిత్యావసరాలు అందజేస్తున్న యువకులు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట గ్రామంలో నిరుపేద కుటుంబాలకు ముస్లిం యువకులు నిత్యావసరాలను పంపిణీ చేశారు. 12కుటుంబాలకు 11రకాలతో కూడిన సరుకులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాలుగా కులమతాలకు అతీతంగా నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బావాజి, ఖాదరబాషా, లాలుబాషా, చాను, అస్లాం బాషా, యాసినా, ముజ్జు, అమ్ము తదితరులు పాల్గొన్నారు.

జెర్సి దూడల ప్రదర్శన

జెర్సీ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి-సోమల: సదుం మండలం పొట్టెంవారిపల్లి గ్రామంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల మిషన్ సహకారంతో జెర్సీ దూడల ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నేటి దూడలే రేపటి ఆవులు దూడలకు సకాలంలో నట్టల నివారణ మందు మరియు వ్యాధి నిరోధక టీకాలను వేయించడం ద్వారా అధిక పాల దిగుబడి పొందవచ్చునని పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు ఆసిఫ్ రైతులకు తెలిపారు. అనంతరం దూడల ప్రదర్శనలో ఆరోగ్యంగా ఉన్న పలు దూడల యజమానులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సోమల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు శ్రీనివాసులు నాయుడు, సదుం పశు వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, తాబ్రిజ్ భాష, వైద్యులు చందన ప్రియ, మునీంద్ర, పశువైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.కోటి మంజూరు

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లెలోని చెన్న కేశవస్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి నిధులను మంజూరు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కోటా వెంకటరమణ, ఎంపిపి చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో మండలంలో పర్యటించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దష్టికి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని విన్నవించగా మంత్రి సొంత నిధులు రూ. 20లక్షలు ఇచ్చారన్నారు. మరో రూ.80లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీంతో ఆలయ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నిధులు మంజూరు చేయించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-సోమల: మండలంలో జగనన్న లేఔట్లలో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహాలను వేగవంతంగా పూర్తయ్యే విధంగా క్షేత్రస్థాయి సచివాలయ సిబ్బంది హౌసింగ్ సిబ్బంది లబ్ధిదారులను ప్రోత్సహించాలని ఎంపీడీవో నాగరాజు ఆదేశించారు. నంజంపేట పంచాయతీ సరస్వతి పురం గ్రామంలో జగనన్న లేఔట్ లో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి వేగవంతంగా పూర్తి చేయాలని వారిని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సబిత, హౌసింగ్ సిబ్బంది గణేష్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబుపై వేదింపులు ఆపాలని మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ టిడిపి నేతలపై కక్ష పూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జనార్దన్‌గౌడ్, రమేష్, మంజు, చిన్నయ్య, సుదర్శన్‌నాయుడు, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

యాదమరిలో రాష్ట్రస్థాయి కోకో పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-యాదమరి: మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో రాష్ట్రస్థాయి బాలబాలికల జూనియర్ కోకో పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఇవో రుక్మిణి, వైయస్సార్ సిపి చిత్తూరు జిల్లా కార్యదర్శి మాదిరెడ్డిపల్లి మనోహర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాల బాలికల జూనియర్ జట్లు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ సెక్రటరీ శరత్ పిడి సురేష్ లోకనాథం పాండియన్ తెలిపారు. రాత్రి వేళల్లో నిర్వహించే పోటీలకు ఎలాంటి అవసరం కలగకుండా లైట్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు పోటీలు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 10 గంటల వరకు జరుగుతుందని నిర్వహాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు హరినారాయణ రెడ్డి రవీంద్ర యాదమరి సర్పంచ్ ఝాన్సీ పలని, యాదమరి ఎస్సై సుమన్, సాఫ్ట్ టౌన్ ప్రవీణ్, కోర్సులు బాలాజీ, అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్,సెక్రటరీ శరత్, పీఈటీలు లోకనాథన్ సురేష్ ,పాండియన్, రవి, కోకో ఆటగాళ్లు ,13 జిల్లాలకు సంబంధించిన కోకు జట్ల టీంలు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పనిభారం తగ్గించి వేతనాలతో కూడిన సెలవులు ప్రకటించాలి

కార్యక్రమంలో మట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించి, పని భారం తగ్గించాలని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్య దర్శి కోదండయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం పచ్చికాపలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీత, చందామర్రై అధ్యక్షతన మెడికల్ ఆఫీసర్ సురేఖకు వినతి ప్రతం అందజేశారు. కోదండయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ఆశ కార్యకర్తలు గ్రామ స్థాయిలో ప్రజలకి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. గర్భవతులను, చిన్నపిల్లలను నిరంతరం పర్యవేక్షిస్తూ 24గంటల పని చేస్తున్నారన్నారు. కనీస సెలవులు కూడా లేకుండా ప్రభుత్వం వారి దగ్గర వెట్టిచాకిరి చేయించుకొని కనీసం ఉద్యోగస్తులుగా గుర్తించడం లేదని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 30వేల మందికి పైగా కార్యకర్తలు సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమంలో ఆశా వర్కర్లదే కీలక పాత్ర ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి వారు చేస్తున్న సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కానీ పక్షంలో పోరాటాలకు సిద్ధపడాల్సి ఉంటుందని హెచ్చరించారు. పచ్చికాపల్లం పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్త లలితకు నెల జీతం పెండింగ్‌లో ఉందని జీతం ఇప్పించాలని మెడికల్ ఆఫీసర్‌ని కోరారు. జీతాల పెండింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు గోవిందస్వామి, జిల్లా కోశాధికారి మాధవి, అరుణ, మునిలక్ష్మి, సుజాత, రోసమ్మ నాయకులు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోటీల్లో నెగ్గి.. విజయకేతనం ఎగరేసి!

- జాతీయ స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రాజట్టు విజయం
- రన్నర్స్‌గా నిలిచిన బాలికల జట్టు
- జట్టులో కీలకంగా చిత్తూరు, తిరుపతి జిల్లా క్రీడాకారులు
- క్రీడాకారులకు పలువురి అభినందనలు

జాతీయ స్థాయిలో విజయం సాధించిన బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు

ప్రజాశక్తి-నగరి: జాతీయ స్థాయిలో జరిగిన బాల్‌బాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రా సబ్ జూనియర్స్ జట్టు విజయకేతనం ఎగరవేసింది. అత్యుత్తమ ప్రతిభ కనబరచి వియబావుట ఎగురువేసింది. ఈ మేరకు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజి శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ప్రతి ఏడాది నిర్వహించే పోటీల్లో 24 రాష్ట్రాలకు చెందిన క్రీడా జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో సబ్ జూనియర్స్ జట్టు తొలి నుంచి ప్రతిభను కనబరుస్తూ అన్ని జట్లును ఓడించి ఫైనల్స్‌కు చేరుకునిందన్నారు. గురువారం జరిగిన ఆఖరి ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర సబ్‌జూనియర్స్ జట్టు తెలంగాణ రాష్ట్ర జట్టుతో తలపడి ఛాంపియన్‌గా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించినట్టు వివరించారు. అలాగే డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లోను ఆంధ్రజట్టు ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. బాలికల జట్టు ప్రతిభను చాటి ఫైనల్‌కు చేరుకున్నా తమిళనాడు జట్టుతో ఓటమి పాలైందన్నారు. దీంతో రన్నర్‌గా నిలిచారన్నారు. రాష్ట్ర బాలుర జట్టులో చిత్తూరు జిల్లా నగరికి చెందిన తేజేష్, బాలికల జట్టులో తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలానికి చెందిన ప్రశాంతి ప్రాతినిధ్య వహించి అత్యుతమ ప్రతిభ చూపినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. వీరిని మంత్రి ఆర్‌కె రోజా ప్రసంశించారు.

నగరి విద్యార్థి ప్రతిభ

బాల్ బాడ్మింటన్ విజేత తేజేష్

బాల్‌బాడ్మింటన్ పోటీల్లో నగరి విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. జట్టు తర పున నగరి వశిష్ట విద్యాలయంకు చెందిన కెసి. తేజేష్ ప్రాతినిధ్య వహించి ఉత్తమ ఆట తీరును కనబరిచి సత్తాచాటాడు. తేజేష్‌కు మంత్రి ఆర్కేరోజా, చిత్తూరు, నగరి బాల్ బాడ్మి ంటన్ అసోసియేషన్ సభ్యులు ప్రశంసించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

-రాష్ట్ర మహిళా నేత కృపాలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న కృపాలక్ష్మి

ప్రజాశక్తి-ఎస్ఆర్‌పురం: ప్రభుత్వ పథకాలు గురించి గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె వైసిపి రాష్ట్ర మహిళా నేత కృపాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంపై ఎస్ఆర్‌పురం మండల గృహ సారుథులు, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి విసృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి డిల్లయ్య, జడ్పిటిసి రమణ, నాయకులు ప్రసాద్‌రెడ్డి, మణి, దిలీప్ రెడ్డి, జనార్ధన్ పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మకు పూజలు

మండలంలోని వివి.పురం గ్రామంలో వెలసిన ఆరిమాని గంగమ్మకు వైసిపి మహిళ నేత కృపాలక్ష్మి శుక్రవారం పూజలు చేశారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అప్పవారికి వివిధ రకాల పుష్పాలను అందించించారు. ఆలయ అర్చకులు కృపాలక్ష్మికి ప్రత్యేక దర్శనం కల్పించి ఆశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

ప్రజాశక్తి-సోమల: సదుం మండలం చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ప్రభావతిదేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలపై సమీక్షించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ, అందుతున్న సేవలు, రెఫెరల్ కేసుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిధిలో గర్భవతుల నమోదు, సురక్షిత కాన్పులకు తీసుకోవాల్సిన చర్యలు, ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతో పార్టీని గెలిపించుకుందాం

జిడి నెల్లూరు టిడిపి ఇన్‌ఛార్జి థామస్

సమావేశంలో మట్లాడుతున్న డాక్టర్ థామస్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: ఐక్యతతో పార్టీని బలోపేతం చేసుకొని గెలుపుసాదిద్దామని జిడి నెల్లూరు టిడిపి ఇంచార్జ్ డాక్టర్ థామస్ ఆ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. శుక్రవారం క్లస్టర్, యూనిట్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించి మట్లాడారు. ఈ దఫా నియోజకవర్గంలో టిడిపిని గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో నాయకులు స్వామిదాస్, శ్రీధర్‌యాదవ్, జ్యోతియాదవ్, కోదండరెడ్డి, గుండయ్య, దేవసుందరం, చిట్టిరెడ్డి, దేవరాజులు, ప్రసాద్, నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అసైన్మెంట్ ల్యాండ్ పట్టాలలో

అనర్హులుంటే తహశీల్దార్‌లపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-చిత్తూరు: అసైన్మెంట్ ల్యాండ్ పట్టాలకు సంబంధించి అనర్హుల ఉన్నారని తెలిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జెసి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం డిఆర్‌ఓ యన్.రాజశేఖర్‌తో కలసి అసైన్మెంట్ ల్యాండ్, జిఈఆర్, రీ సర్వేపై తహశీల్దార్లు, మండల సర్వేయర్లుతో జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల వారిగా సమీక్ష నిర్వహించారు. జేసి మాట్లాడుతూ అసైన్మెంట్ ల్యాండ్ పట్టాలకు సంబంధించి అనర్హుల ఉన్నారని తెలిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మళ్ళీ ఒక్కసారి వేరిఫికేషన్ చేసుకోవాలని తహశీల్దార్లను ఆదేశించారు.వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ నెల 25 కల్లా జిఈఆర్ సర్వే పూర్తి చేయాలని చేయాలన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు పూర్తి చేయాలి: జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి కల్లా ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు పూర్తి చేసి సంబందితా శాఖలకు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ నుండి డిఆర్‌ఓ యన్.రాజశేఖర్‌తో కలసి జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, గృహ నిర్మాణం, జగనన్న పాల వెల్లువ సర్వే, జిఈఆర్, స్వామిత్వ పురోగతిపై ఆర్డీఓలు, పంచాయతీ రాజ్, జిల్లా పంచాయతీ,గహ నిర్మాణ, విద్యాశాఖ , పి ఓ సర్వ శిక్ష అభియాన్,పశు సంవర్ధక, సహకార సంస్థ, సర్వే శాఖల అధికారులు యం ఈ ఓ లు, తహశీల్దార్ల, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ల తో జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామ,వార్డు సచివాలయాలు,రైతు భరోషా కేంద్రాలు,వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ భవనాలు నిర్మాణాలు పనులకు సంబంధించి ప్రభుత్వ నిర్దేశించిన సమయానికి కల్లా పంచాయతీ రాజ్ ఏ ఈ లు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయం చేసుకొని పూర్తి చేసి సంబందితా శాఖలకు అందజేసి ఆన్ లైన్లో అప్ లోడు చేయాలని యం పి డి ఓల ను ఆదేశించారు. రూఫ్ లెవల్ లో ఉన్న భవనాలు 2024 జనవరి 10 కల్లా, ఫస్ట్ ఫ్లోర్ లో ఉన్న భవనాలు డిసెంబర్ 25 కల్లా .సెంకండ్ ఫ్లోర్ లో ఉన్నవి డిసెంబర్ 10 కల్లా, ఫినిసంగ్ అయ్యినవి నవంబర్ 5 కల్లా పూర్తి చేసి సంబందితా అధికారులకు అందజేయాలని ఎంపిడిఓ లను ఆదేశించారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మెరుగైన ఆరోగ్యంతో సంతోషంగా జీవించొచ్చు అని ఇంచార్జ్ తహశీల్దార్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని కెఎం.కండిగ సచివాలయంలో సర్పంచ్ ప్రవళిక ఆధ్వర్యంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డాక్టర్లు ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ఉప సర్పంచ్ కుట్టి తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని పాపిరెడ్డిగారి పల్లిలో శుక్రవారం సర్పంచ్ పార్థసారథిరెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపిపి అబ్బుఅనిత, ఎంపిటిసి భారతి, నాయకులు చిన్నమరెడ్డి, రూపారెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే నేలమట్టమైన బస్ షెల్టరు

టిడిపి నేతల ఆందోళన

నిరసన తెలియజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-శాంతిపురం: ప్రజా సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సు షెల్టరును కూల్చివేశారంటూ టిడిపి నేతలు శుక్రవారం ఆందోళనకు దిగారు. శాంతిపురంలోని బస్‌షెల్టరు నేలమట్టం గుర్తించిన నేతలు కంగుతిన్నారు. గురువారం చూసిన షెల్టరు శుక్రవారం కనిపించకుండా పోవడంతో ఆగ్రహానికి గురైయ్యారు. గతంలో ఎంపి రామకృష్ణారెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన బస్‌షెల్టరును తొలగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో బైటాయించి నిరసన తెలియజేశారు. కూల్చివేతకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే స్థలంలో తిరిగి బస్‌షెల్టర్‌ను నిర్మించాలని అధికారులకు తెలియజేశారు. నిరసన కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గం టిడిపి ముఖ్య నేతలు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, శాంతిపురం మండల నాయకులు విశ్వనాథ్ నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ్ కుమార్, నాగరాజు,విజయరామ్ రెడ్డి, ఆర్ఎస్ మని, గోపాల్, బసవరాజు, పలువురు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ ను వెంటనే ఆపాలి

- కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అక్రమంగా జరుగుతున్న మైనింగ్‌ను ఆపాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. అక్రమంగా సాగిస్తున్న మైనింగ్‌ని ఆపాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను వెంటనే ఆపాలని పేర్కొన్నారు.

విన్నవించాం.. పరిష్కరించండి

- జగనన్నకు చెబుదాంలో వినతుల వెల్లువ
- వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన జెసి శ్రీనివాసులు

అర్జిలను స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-సోమల: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వినతుల వెల్లువ కనపించింది. శుక్రవారం సదుం మండలంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ రకాల సమస్యలతో అర్జిలను జెసికి అందజేశారు. కార్యక్రమంలో మొత్తం 44 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. రెవెన్యూకి సంబంధించి 23, సర్వే 4, డిజేబుల్ 2, పంచాయతీరాజ్ 2, పోలీస్‌కు సంబంధించి 2, వ్యవసాయం, మైనారిటి, డిఆర్డిఎ, హౌసింగ్, పింఛన్‌కు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున సమస్యలు అందినట్లు అధికారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెసి శ్రీనివాసులు మాట్లాడుతూ 15రోజుల లోపు పరిష్కారం చూపాలని ఆదేశించారు. అర్జీలపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, స్పందన కార్యక్రమం ద్వారా అందిన అర్జీల సమస్య పరిష్కరించడానికి అవకాశం లేకపోతే అందుకు గల కారణాలను దరఖాస్తుదారునికి ఎందువల్ల పరిష్కారం చేయలేక పోతున్నామో అన్న విషయాన్ని అర్జీదారునికి చెప్పాలన్నారు. వచ్చిన అర్జీలు మళ్ళీ రాకుండా చూడాలన్నారు. 15 రోజుల తర్వాత ప్రతి అర్జీని పరిశీలించి, తీసుకున్న చర్యలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఎలాంటి పరిస్కారం చేయకుండా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డివో శివయ్య, జెడ్పి సిఇవో ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

మహాలక్ష్మి అలంకరణలో బంగారమ్మ


మహాలక్ష్మి అలంకరణలో బంగారమ్మ

ప్రజాశక్తి-కార్వేటినగరం: దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బంగారమ్మ ఆలయలో విశేష పూజలు జరిగాయి. మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా ద్రౌపది ధర్మరాజుల ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట మహాభారత ఆలయంలో శ్రీకృష్ణ, ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయలో విశేషంగా పూజలు జరిగాయి.

సోమల: మండలంలోని కందూరులో వెలసిన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్న వరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి కేసరి అలంకారం చేసి భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు.

సరస్వతీదేవిగా ముత్యాలమ్మ

ప్రజాశక్తి బంగారుపాలెం: శరన్నవరాత్రులలో భాగంగా శుక్రవారం మండలంల కేంద్రంలోని ముత్యాలమ్మ వారు సరస్వతిదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఉభయ దారులకు బంగారంపాలెం కరణం సంక్షేమ సంఘం సభ్యులు వ్యవహరించారు. అదేవిధంగా మండలలోని వజ్రాల బోయకొండ గంగమ్మ సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE OF CHITTOOR
I.A.No. 597 of 2022
O.S.No. 624 of 2022
Between:
P.Sankar Naidu ...Plaintiff
And:
Reddi Basha and another ...Defendant
NOTICE TO 2nd DEFENDANT/ 2nd RESPONDENT
To
REDDAMMA, D/o Sathar Saheb, Maseedu Street, Dhamalcheruvu Village and Post, Pakala Mandal,Chittoor District
Please take notice that the above suit O.S.No.624 of 2022 and the I.A.N.597 of 2022 filed by the Plaintiff against you for attachement and recovery of suit pronote amount and the same is stands posted to **23-11-2023** for your appearance. If you do not appear on **23-11-2023 at 10-30 A.M** before this Hon'ble Court either in person or through an Advocate the matter will be decided on ex-parte.
Sd/-P.RAMAMURTHY NAIDU
Counsel for the Plaintiff
Plance : Chittoor, Dt.13-10-2023

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL-CUM-III ADJ: TIRUPATI
MVOP.NO. 9 OF 2020
A. Latha & others ...Petitioners
Vs
Bandaru Chalapathy & others ...Respondents
NOTICE TO RESPONDENT NO.1
Bandaru Chalapathy s/o. B. Krishna Jandrapeta, Jandrapalli village, Sodum Mandal, Chittoor District.
Please take notice that the above O.P. filed by the petitioners under Section 166(1)(c) of M.V. Act against you for compensation of Rs. 12,00,000/- for the death of A. Ramesh in a motor accident occurred on 26-11-2006 at 12-15 p.m.,on Boyakonda-Chowdepalli road, near Sri Ranabheri Gangamma temple, Chowdepalli Mandal, Chittoor District caused by you being the driver of the Tractor and trailor No. AP03/D-1946 & APO3/D-1947 and the above O.P. is posted to 01-11-2023 for your appearance. Please attend on that day before the above said court by 10-30 a.m., either you or through an Advocate and file your objections if any. Otherwise the mnatter will be decided exparte.
Hearing date: 01-11-2023
D.RAMAKRISHNA
Advocate for petitioners, Tirupati.